ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 11 ఆగస్టు 2025



ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ

రాయికల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని జీఎంఆర్ ఎలక్ట్రికల్ దుకాణంలో శనివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం పట్టణంలోని జీఎంఆర్ ఎలక్ట్రికల్ దుకాణం వెనుక భాగం తాళాలు పగులగొట్టి దుండగులు దుకాణంలోకి చొరబడి దుకాణంలోని రూ.23వేల నగదును ఎత్తుకెళ్లారు. దుండగులు ఎలక్ట్రికల్ దుకాణంలోకి వెళ్లడం సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. దుకాణ యాజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

'ఉపాధి' కుదింపు

జిల్లా సమాచారం	
మండలాలు	20
గ్రామ పంచాయతీలు	380
జాబ్ కార్డులు	1.67 లక్షలు
కూలీల సంఖ్య	2.73 లక్షలు

- ఈజీఎస్ కూలీల పనిదినాల్లో కోత
- గత యేడాది జిల్లాలో 39.99 లక్షల పని దినాలు
- ప్రస్తుత యేడాది 19.08 లక్షలకు పరిమితం



జగిత్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలు తగ్గుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను తగ్గించేందుకు 2008 సంవత్సరంలో నాటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టింది. భూమి లేని వారికి వ్యవసాయం పనులు లేని సమయంలో కూలీలకు గ్రామాల్లోనే ఉపాధి కల్పించేందుకు ఈ పథకం దోహద పడింది. ఏటేటా గ్రామీణ ప్రాంతాల్లో పథకానికి ఆదరణ పెరిగి ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో కూలీలు జాబ్ కార్డులు తీసుకున్నారు. నాలుగేళ్ల క్రితం జిల్లాలో 26.63 లక్షలుగా ఉన్న పనిదినాలు జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 19.80లక్షలకు కుదించబడినట్టు అధికారిక లెక్కలతో వెల్లడవుతోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న కొత్త నిబంధనలతో కూలీలు పనికి దూరమవుతున్నారు.

● వసతుల లేమి..

పథకం ప్రారంభంలో పని ప్రదేశంలో కూలీలకు నీడ, పనిముట్లు ఇవ్వటంతో పాటు తాగునీరు, మెడికల్ కిట్ లాంటి ఎన్నో సౌకర్యాలు కల్పించేవారు. పని ప్రదేశంలో గాయపడిన వారికి ప్రభుత్వం తరఫున వైద్యం అందించడంతో పాటు పరిహారం ఇచ్చే వెసులుబాటు ఉండేది. ఇన్నాళ్లు స్వగ్రామంలో ఉపాధి పనులు చేసుకుంటూ కూలీలు ఆర్థికంగా వృద్ధి చెందారు. సరియైన వివరాలు సేకరించకుండానే పనిదినాలను ఏటేటా తగిస్తూ కూలీలను అయోమయంలో పడేస్తున్నారు. జిల్లాలో జాబ్ కార్డులు పొందిన కుటుంబాల్లోని అందరూ క్రమం తప్పకుండా పనిచేస్తే ఏడాదికి కేటాయించిన పనిదినాలు పట్టుమని పది రోజుల్లో పూర్తి కావడం గమనార్హం.

● జిల్లాలో పని దినాలు ఇలా...

జిల్లాలో 2022-23 సంవత్సరంలో 26.63 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్ణయించగా 32.26 లక్షల పని దినాలు కల్పించారు. 2023-24 సంవత్సరంలో 30.72లక్షల పని దినాల లక్ష్యానికి గాను 37.32 లక్షల పనిదినాలు కల్పించారు. 2024-25 సంవత్సరంలో 39.99లక్షల పనిదినాల లక్ష్యానికి గాను 42.45 లక్షల పని దినాలు కల్పించారు. ప్రస్తుత 2025-26 సంవత్స రానికి గాను 19.80లక్షల పని దినాల లక్ష్యాన్ని నిర్ణయించారు. గత యేడాదితో పోలిస్తే పనిదినాల సంఖ్య తగ్గింది. కొన్నేళ్లుగా వరుసగా ఏటేటా పనిదినాలు తగ్గుతున్నాయి. జిల్లాలో ఉన్న కూలీల సంఖ్యకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇచ్చిన పనిదినాలు చాలా తక్కువగా ఉన్నందున మరికొన్ని పనిదినాలు పెంచాలని ఈజీఎస్ కూలీలు కోరుతున్నారు.

● చేపట్టే పనులు

ఉపాధిహామీ పథకంలో గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల వ్యవసాయ పొలాల్లో భూమి చదును, చెరువు, కాల్వల పూడికతీత, శుభ్రం చేయటం వంటి పనులు చేపట్టేవారు. అంతేగాకుండా ప్రధాన కాల్వలోని పూడికతీత, చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించడం, పొలాలకు మట్టిరోడ్డు, పంట పొలాల్లో నీటి కుంటల నిర్మాణాలు లాంటి పనులు..

- మిగతా 8లో

'అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి'



అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న నాయకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పలువురు వక్తలు సూచించారు. భారత రాజ్యాంగంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అగ్రభాగం కేటాయించిన అంబేద్కర్ మహనీయుడని కొనియాడారు. ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాల నాయకులు నల్ల శ్యాం, కంటె అంజయ్య, బాలమురళీ కృష్ణ, ఎస్. గంగారాం, పిడి రాజేశ్వర్ రావు, మద్దెల నారాయణ, కాయితీ శ్రీనివాస్, అనంతుల కాంతారావు, తక్కళ్ళ రమేష్ పాల్గొన్నారు.

ధర్మపురిలో భారీ వర్షం



లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఎదుట చేరిన వర్షపునీరు

ధర్మపురి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఎదుట రోడ్లపై వర్షం వల్ల నీరు నిలిచి పోయింది. దీంతో దైవ దర్శనానికి వచ్చే భక్తులు, వ్యాపారులు తీవ్ర ఆటంకాలకు గురయ్యారు. అలాగే పట్టణంలోని ప్రధాన రోడ్లు, బ్రాహ్మణవీధిలో కూడా వర్షానికి నీరు నిలిచి పోవడం వల్ల గోదావరి నది స్నానాలు, దైవ దర్శనం కోసం వచ్చే భక్తులు, ప్రజలు తీవ్ర ఆటంకాలకు గురయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడా కురిసిన వర్షం వల్ల, పంట పొలాలు చేసే రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అప్పు చెల్లించాలని ధర్నా

జగిత్యాలరూరల్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించాలని జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లోని ఓ రాజకీయ నాయకుడి ఇంటి ఎదుట ఆదివారం పలువురు బాధితులు ఆందోళన చేశారు. వారి కథనం ప్రకారం ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు పలు పొదుపు సంఘాల్లో, కొంత మంది వద్ద రూ.15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వాటిని చెల్లించకపోవడంతో ఆదివారం ధర్నా చేపట్టారు. అనంతరం బాధితులు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉంది'

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌లకు కట్టుబడి ఉందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని 19, 26, 27 వార్డులలో 50లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసిరోడ్డు పనులకు భూమి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని 141 మున్సిపాలిటీలలో జగిత్యాల మున్సిపాలిటీకి అత్యధికంగా నిధులు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు అడువాల జ్యోతి, మెట్ట బట్టి, గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, బాలే శంకర్, ముస్కు నారాయణరెడ్డి, రజీ, షకీల్, రామకృష్ణ కృష్ణరెడ్డి, రాజ్‌కుమార్, డిఈ వరుణ్, ఏఈలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

జగిత్యాలరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌళిక వసతుల కల్పననే ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి లో రూ. 27 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం జగిత్యాల మండలం తిప్పన్నపేటలో నిర్మించిన పల్లె దవాఖానాను ప్రారంభించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.50లక్షలతో చేపట్ట నున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పిం చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిప్పన్నపేటకు రూ.16 కోట్లతో బ్లాక్‌స్పాట్ రోడ్డుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, డీఇ మిలింద్, ఎంపీఓ రవిబాబు, నాయకులు దామోదర్‌రావు, ఎల్లారెడ్డి, బాలముకుందం, రవీందర్‌రెడ్డి, గంగాధర్, మహేష్, లక్ష్మీ, రాజలింగం, కార్యదర్శి కొమురయ్య పాల్గొన్నారు.

మెట్‌పల్లి ఏఎంసీ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

- పెద్దఎత్తున గోనె సంచులు దగ్ధం
- రూ.30 లక్షల ఆస్తి నష్టం

6

'నులి'పేద్దాం

- నేటి నుంచి నులి పురుగు నిర్మూలన కార్యక్రమం

8

- ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పంపిణీ
- జిల్లాలో 2.22 లక్షల మంది గుర్తింపు

ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ళు నిరుపేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని కలికోట, పోతారం గ్రామాల్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనులను పరిశీలించి ప్రగతిని పరిశీలించారు. గూడు లేని పేదలకు ఇళ్ళు నిర్మిస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందని చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ ఇళ్ళ నిర్మాణాల పేరిట పేదలను మోసం చేసిందని ఆరోపించారు. కలికోటలో 7, పోతారంలో 12 ఇళ్ల ప్రగతి దశలో ఉన్నాయని తెలిపారు. బేస్‌మెంట్ స్థాయిలో లక్ష రూపాయలు అందుకున్న లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పులి హరిప్రసాద్, కల్లెడ గంగాధర్, మార్క రాజేశం ఉన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి రిమాండ్

బీర్‌పూర్,ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుని అదుపులోకి తీసుకొని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు. బీర్‌పూర్ మండల కేంద్రంలోని అనునూరిగూడెంకు చెందిన గోపి మల్లేష్ అనే వ్యక్తి పెంచుకుంటున్న కుక్కలు ఈనెల 8న అదే గూడెంకు చెందిన దస్తూరి శ్రీకాంత్ ఇంటి ముందు అరుస్తూ ఇల్లు చిందర వందరగా చేస్తున్నాయని తరిమి కొట్టాడు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గోపి మల్లేష్, శ్రీకాంత్‌పై గొడ్డలితో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి తండ్రి దస్తూరి పోషరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపి మల్లేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పావని కంటి ఆసుపత్రిలో ఆదివారం 13 మందికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఉచిత కంటి ఆపరేషన్‌లు నిర్వహించారు. జగిత్యాల నియోజక వర్గంలోని నిరుపేదలకు పావని ఆసుపత్రితో పాటు, ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు నిర్వహించారు.

ఆపరేషన్ల అనంతరం రోగులకు ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, మాజీ ఎంపీపీ సొల్లు సురేందర్, సత్తిరెడ్డి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి'

కొడిమ్యాల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : అర్హులైన రైతులు ఈ నెల 13లోగా బీమా చేసుకోవాలని ఏవో పి.జ్యోతి కోరారు. ఆదివారం ఏవో విలేకరులతో మాట్లాడుతూ 2025 జూన్ 5వరకు పట్టాదారు పాస్ బుక్ పొంది, 18నుండి 59సంవత్సరాల వయస్సు వారు రైతు బీమా చేసుకోవటానికి అర్హులు అన్నారు. సంబందిత రైతు స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు రైతు ఆదార్‌కార్డు, రైతు భూమి పాస్ బుక్, నామిని ఆదార్‌కార్డు జిరాక్స్‌లను జత చేయాలన్నారు. అర్హత కలిగిన రైతులు తప్పకుండ సంబందిత ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఏవో కోరారు.

●**మల్యాల:** మండలంలోని రైతులు రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్ కోరారు. 18 నుంచి 59 ఏళ్ల లోపు గల రైతులు రైతుబీమాకు అర్హులని ఈ నెల 13లోపు సంబందిత ఏఈవోల వద్ద దరఖాస్తులు అందించాలని సూచించారు.

●**ఇబ్రహీంపట్నం:** ఈనెల 13 లోపు రైతు బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియ జేశారు. కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు జూన్5 లోపు వచ్చిన రైతులు, ఇంతవరకు రైతు బీమా చేసుకోని రైతులు మాత్రమే రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

●**మల్లాపూర్:** మండలంలో కొత్తగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి పాసుబుక్కులు వచ్చినవారు రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లావణ్య ఆదివారం ప్రకటన ద్వారా తెలిపారు. జూన్ 5 వరకు కొత్తగా పట్టదారు పాసు బుక్ వచ్చిన ప్రతి ఒక్కరు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోచ్చని అన్నారు. చివరి తేది 13లోపు దరఖాస్తులు తీసుకోబడునని తెలిపారు. దరఖాస్తులు చేసుకునే వారు 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14లోపు పుట్టిన రైతులు మాత్రమే, వారు దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టదారు పాసుబుక్కు లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన పేపర్, రైతు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డుల జిరాక్స్‌లను ఏఈవోలు, వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

'బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం'



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల వ్యవహారంలో బీసీలను కాంగ్రెస్ నమ్మించి మోసం చేస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్ వ్యవహారం రాష్ట్ర పరిధిలో లేదని, కేంద్ర పరిధిలోని అంశమని, 9వ షెడ్యూల్‌లో చేరిస్తేనే అమలవుతోందన్నారు. బీసీల ఓట్లు కొల్లాగొట్టడం కోసం శాసనసభ తీర్మానం, మంత్రి వర్గ సమావేశము, ఆర్డినెన్స్, గవర్నర్ దగ్గరకు పంపడంచ కేంద్రంకు పంపడం, ఆమోదం లభించని పరిస్థితి అందరికి తెలిసిన విషయమేనన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు అందరు ఢిల్లీలో ధర్నా చేస్తూ మేము ప్రయత్నం చేసినమని, రాహుల్ గాంధీ ప్రధాని అయిన తర్వాత బీసీ రిజర్వేషన్ సాధిస్తామని అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీల కోసం బీఆర్‌యస్ పార్టీ చిత్తశుద్ధితో ఉందని, బీసీ రిజర్వేషన్‌పై బీఆర్‌యస్ పార్టీ ఈ నెల 14వ తేదీన కరీంనగర్‌లో నిర్వహిస్తున్న సమావేశానికి కేటీఆర్ రానున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో 600మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. మిడ్ మానేరు, యల్లంపల్లి, మల్లన్న సాగర్, ఎస్సారెస్పీ రిజర్వాయర్‌లో నీళ్ల లేవని పేర్కొన్నారు. ఈ సమా వేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, నాయకులు ఓరుగంటి రమణ రావు, దావ సురేష్, జవ్వాజి ఆది రెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

కొడుకు మరణం తట్టుకోలేక.. తండ్రి ఆత్మహత్య


బాలేశ్వర్‌రెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన బాలేశ్వర్‌రెడ్డి(52) అనేవ్యక్తి కొడుకు మరణం తట్టుకోలేక మనోవేద నతో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివ రాల ప్రకారం.. గూడు బాలేశ్వర్‌రెడ్డి, మమత దంపతల కుమారుడు సంకీర్త్ క్యాన్సర్ వ్యాధితో రెండేళ్ల క్రితం చనిపోయాడు. కొడుకు మరణం తట్టుకోలేక తరుచుగా బాలేశ్వర్‌రెడ్డి బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్రమక్రమంగా క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన బాలేశ్వర్‌రెడ్డి తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బాలేశ్వర్‌రెడ్డి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

ముస్తాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు నరేశ్ (27) అనే యువకుడు శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు నరేశ్ ముస్తాబాద్‌కు ద్విచక్రవాహనంపై వచ్చి పెట్రోల్ పోసుకొని వెళ్తున్నాడు. హనుమాన్ టెంపుల్ నుంచి వెళుతుండగా ఎదురుగా రోడ్డుపై పార్కింగ్ చేసిన బోర్‌వెల్ లారీ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్స్ వేయకుండా రోడ్డు మీద పార్కింగ్ చేశాడు. ఈక్రమంలో బోర్‌వేల్ లారీని నరేశ్ ద్విచక్రవాహనం ఢీకొట్టింది. నరేశ్ తలకు, కడపులో తీవ్రగాయాలుగా కాగా సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టున ఎస్సై తెలిపారు.

రాజస్థాన్‌కు చెందిన వివాహిత ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వద్ద వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన వివాహిత శారద(22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వినాయకుడి విగ్రహాలు తయారుచేసేందుకు కూలగా శారద, ఆమెభర్త స్థానికంగా గదిలో ఉంటున్నారని, శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు.. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. శారద ఆత్మహత్యకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చ్యూరీగదిలో భద్రపరిచారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంపల్లి శివారులో కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కారు అతి వేగం వల్ల ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు గాయాలైన యువకుడిని 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పెద్దపల్లి రూరల్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

మేమేమి చేశాము పాపం..

- నాలుగు నెలలుగా కళాకారులకు అందని పెన్షన్
- భారమవుతున్న కుటుంబపోషణ
- ప్రభుత్వం, నాయకులు ఆదుకోవాలని వేడుకోలు


చిందు యక్షగాన కళాకారులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సంగీతాన్ని అందించే వాయిద్యాలు మూగ బోయాయి. తాళాలు శృతి తప్పాయి. రక్తికట్టించే గజ్జెల సవ్వడి ఆగిపోయింది.. గదలు, బా ణాలు, ఖడ్గాల విన్యాసాల గతులు తప్పాయి. నాట్యం, పాట, నాటకం, పలు కళలు ఆహార్య అభినయాలు అంతరించిపోయాయి. ఉమ్మడి జిల్లాలో 55 సంవత్సరాలు దాటిన సుమారు 25 కళలకు చెందిన పెన్షన్‌కు అర్హులైన దాదాపు 50 నుంచి 60 మంది కళాకారులున్నారు. వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. యక్షగానంతో పాటు వీధి, గంటె భాగవతులు డప్పు, ఒగ్గు, బుర్ర, హరికథలు వంటి 25 కళలకు చెందిన కళాకారులకు నాలుగు నెలలుగా పెన్షన్ అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ కోసం పలువురు కళాకారులు కూలీలుగా మారారు. కొందరు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడ్డారు. మే వరకు 3 నెలలకొకసారి 3 వేల చొప్పున పెన్షన్ ఇచ్చారు. తరువాత పెన్షన్ నిలిచిపోవడంతో కళాకారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

● కళాకారుల డిమాండ్లు

ప్రభుత్వం తరుపున కార్యక్రమాలను ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని కళాకారులు కోరుతున్నారు. సంఘ భవనాన్ని నిర్మించి పెన్షన్ ప్రతినెలా అందేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల మంజూరు చేయాలంటున్నారు. కొత్త ప్రభుత్వం, నాయకుతోనైనా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ఆదుకోవాలి...

- గజవెల్లి కిష్టయ్య, చిందు యక్షగాన కళాకారుడు



ఒకప్పుడు మా యక్షగాన, కళా ప్రదర్శనలతో కుటుంబంలోని అందరికి ఉపాధి దొరికింది. ఇప్పుడు ఆదరణ కరువయింది. మమ్మల్ని ముఖ్యమంత్రి ఆదుకోవాలి.

ఆసరాగా నిలవాలి...

- ఈరు రాజమల్లయ్య, ఒగ్గు కళాకారుడు



మేం ఒగ్గు కథ చెబుతాం. కళాకారులకు సకాలంలో పెన్షన్ అందజేసి ఆసరాగా నిలవాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి.

మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నవజాత శిశువు మృతి

● సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ


ఆసుపత్రిలో రోదిస్తున్న శిశువు తల్లి ప్రేమలత, కుటుంబ సభ్యులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున నవజాత శిశువు మృతిచెందింది. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మహరాజు ప్రేమలత పురిటినొప్పులతో గురువారం జగిత్యాలలోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి వచ్చింది. శుక్రవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం నుంచి బాబు సరిగా పాలు తాగడం లేదని విధులు నిర్వ హిస్తున్న నర్సుల వద్దకు వెళ్లితెలిపినప్పటికీ వారు నిర్లక్ష్యం వహించడంతో శిశువు అపస్మారక స్థితి లోకివెళ్లి మృతి చెందినట్లు బంధువులు ఆరో పించారు. వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి ఉంటే తనబిడ్డ దక్కేవాడని తల్లి ప్రేమలత రోదిస్తూ తెలిపింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన నర్సులపై చర్య తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కాగాశిశువుకు పాలు పట్టించిన తర్వాత భుజంపై వేసుకోకుండా నిద్రపుచ్చడం వల్లనే శిశువు మృతి చెందినట్లు విధుల్లో ఉన్న నర్సులు తెలిపారు.


మృతిచెందిన శిశువు

● విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం...

నవజాతశిశువు మృతి సంఘటనపై విచారణ జరిపిచర్యలు తీసుకుంటామని మాతా శిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ జి. కృష్ణమూర్తి తెలిపారు. శిశువు ఆరోగ్య పరిస్థితిపై అతడి బంధువులు వచ్చిచెప్పినప్పటికీ విధుల్లోఉన్న వైద్యుడికి సమాచారం అందించకుండా నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి


రామస్వామి(ఫైల్)

కోనరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన కుంటెల్లి రామస్వామి(40) అనేరైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందాడు. గ్రామస్థులకథనం ప్రకారం గ్రామానికి చెందిన రామస్వామి ఉదయం తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. ఈక్రమంలో విద్యుత్ స్టార్టర్ బావిపక్కనే ఉండడంతో కరెంటు పెట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వెళ్లిన రామస్వామి రాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో భార్య కొమురవ్వ, కుమారుడు అరవింద్ అనుమానం వచ్చి బావి వద్దకు వెళ్లి చూసేసరికి బావిలో శవమై కనిపించాడు. ఈ విషయమై కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్‌ఐ తిరుమల్ సంఘటనస్థలానికి చేరుకొని మృతదేహాన్ని గ్రామస్తుల ద్వారా బయటకు తీయించి ప్రమాదానికి గల కారణాలు పరిశీలిస్తున్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే కరీంనగర్ సుభాష్‌నగర్‌కు చెందిన కామారపు అనిల్‌కుమార్(36) ఆదివారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎల్‌ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామా రపు అనిల్‌కుమార్ సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కాని స్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అనిల్ కుమార్ తన సన్నిహితులకు కొంతడబ్బు అప్పుగా ఇచ్చాడు. డబ్బును తిరిగి ఇవ్వాలని సన్నిహితులను కోరగా ఇవ్వకపోగా వేదింపులకు గురిచేశారు. దీంతో మనస్థాపానికి గురైన అనిల్‌కుమార్ జూలై31న అలుగునూర్ శివారులో పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు అనిల్‌కుమార్‌ను చికిత్సకోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం అనిల్ కుమార్ మృతిచెందాడు. మృతుడు అనిల్‌కుమార్ తండ్రి కామారపు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మేకమల్ల ఐలయ్య అనేవ్యక్తి తనను అదే గ్రామానికి చెందిన లచ్చయ్య కులం పేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

వదినపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టులో వదినపై దాడి చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. జుంగేని వెంకటేశ్ అనే యువకుడు వదినతో తరచూ గొడవ పడడమే కాకుండా ఆదివారం ఇంట్లోకి వచ్చి దూషిస్తూ దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయగా వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రామాల సరిహద్దు వివాదం

- బోర్డుల తొలగింపు వివాదాస్పదం ● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- ఏళ్లుగా నూకపల్లి, రామన్నపేట గ్రామాల మధ్య పంచాయితీ


మల్యాల సీఐ రవికి ఫిర్యాదు చేస్తున్న రామన్నపేటవాసులు

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని నూకపల్లి, రామన్నపేట గ్రామాల మధ్య సరిహద్దు వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతుండగా తాజాగా ఆదివారం రామన్నపేట వాసులు మల్యాల సీఐ నీలం రవికి ఫిర్యాదు చేశారు. నూకపల్లి, రామన్నపేట గ్రామాలు 1978లో ఏర్పడగా నూకపల్లి గ్రామాన్ని రెవెన్యూ పంచాయతీగా పేర్కొన్నారు. నూకపల్లి రెవెన్యూ పంచాయతీ గ్రామం కింద నూకపల్లితో పాటు రామన్నపేట చేర్చారు. ఇక్కడే రెండుగ్రామాల మధ్య పంచాయితీ ఏర్పడింది. కరీంనగర్-జగిత్యాల మార్గం దీని పరిధిలోనే ఉండగా మల్యాల క్రాస్‌రోడ్డు నుంచి రాజారం వరకు విలువైన భూములు ఉన్నాయి. దీంతో గతంలో సర్వే నంబర్ల ఆధారంగా రెండు గ్రామాలకు కేటాయించుటకు నిర్ణయించారు. ఇందులో భాగంగా మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతంకు మల్యాలవైపు రామన్నపేట, నూకపల్లి వైపు నూకపల్లి గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో సర్వే నంబర్ల ఆధారంగా ఇంటి అనుమతులు ఇస్తున్నారు. అయితే తాజాగా మల్యాల క్రాస్ సమీపంలోని పెట్రోల్ పంప్ యజమాని పంప్ పక్కనే కల్యాణ మండపం నిర్మించి ఆదివారం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకొని బోర్డుపై రామన్నపేటగా పేర్కొన్నాడు. దీంతో నూకపల్లి గ్రామస్థులు శనివారం అక్కడకు వెళ్లి తమ పరిధిలో ఉన్నందున రామన్నపేట గ్రామ పేరు తొలగించాలని అనడంతో ఆ పేరు తొలగించి మల్యాల క్రాస్ రోడ్డుగా పేర్కొన్నారు. రామన్నపేట పేరు తొలగింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆదివారం గ్రామస్థులు ప్రారంభోత్సవ కార్యక్రమం వద్దకు వెళ్లి యజమానితో గొడవకు దిగారు. నిర్మాణానికి తమ గ్రామపంచాయతీ అనుమతి ఉన్నందున రామన్నపేట పేరు మార్చాలని యజమాని కొత్త సురేశ్‌ను కోరారు.

తనకు రెండు రోజులు అవకాశం ఇవ్వాలని కోరడంతో అక్కడ నుంచి వెళ్లారు. అంతకు ముందు బోర్డు తొలగింపుపై నూకపల్లి గ్రామస్థులపై రామన్నపేట వాసులు మల్యాల సీఐ నీలం రవికి ఫిర్యాదు చేశారు. భయభ్రాంతులకు గురి చేసి బోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమీపంలోని సూపర్‌మార్కెట్, వీఆర్‌కే కళాశాల పేర్లు కూడా మార్చాలని నూకపల్లి గ్రామస్థులు హెచ్చరించారని రామన్నపేట వాసులు సీఐకి వివరించారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

● 30 కార్ల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్ తొలగింపు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కార్లకు బిగించుకున్న బ్లాక్ ఫిల్మ్‌లను టింట్ మీటరుతో తొలగించారు. 30కార్ల యజమానులకు జరిమానా విధించారు. అనంతరం వాహనాల యజమానులకు కరీంనగర్ ట్రాఫిక్‌సీఐ కరీం ఉల్లాఖాన్ కౌన్సెలింగ్ నిర్వహిచారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం కార్లు, ఇతర వాహనాల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్ వేయొద్దన్నారు. కార్ల అద్దాలు షోరూం నుంచి వచ్చిన విధంగానే ఉండాలని, అదనపు ఫిల్మ్‌లు వేయరాదని అన్నారు. ట్రాఫిక్‌నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు, నేరఘటనలు నియంత్రించేందుకు ముందస్తుగా నిర్వహిస్తున్న తనిఖీలు, ఇతరచర్యలకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఆర్‌ఐ కుమారస్వామి, ఎస్సై ఇషాక్ అహ్మద్, ఆర్‌ఎస్సై సురేష్ పాల్గొన్నారు.


బ్లాక్ ఫిల్మ్ తొలగించి, వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కరీం ఉల్లఖాన్, ఆర్‌ఐ కుమారస్వామి

మంచినీరు ఇవ్వడం లేదని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన


వాటర్ ట్యాంక్ ఎక్కిన తిప్పని శ్రావణ్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాఫర్‌ఖాన్ పేట గ్రామంలో ఆదివారం సాయంత్రం మాజీ వార్డు మెంబర్ తిప్పని శ్రావణ్ గ్రామానికి మంచినీరు ఇవ్వడం లేదని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లో నిండా నీరు ఉన్నా గ్రామానికి మంచినీరు ఇవ్వక ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రామస్థులు వాటర్ ట్యాంక్ దిగిరావాలని కోరగా, శాంతించిన ఆయన దిగిరావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎక్స్‌కవేటర్ సీజ్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి గ్రామశివారు నుంచి మట్టిని తరలిస్తున్నారంటూ రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తరలిస్తుండగా, వాటిని సీజ్‌చేసినట్లు తహసీల్దార్ కనుకయ్య తెలిపారు. అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెట్‌పల్లి ఏఎంసీ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

● పెద్దఎత్తున గోనె సంచులు దగ్ధం ● రూ.30 లక్షల ఆస్తి నష్టం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు మూడు లక్షల గోనె సంచులు దగ్ధమై రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగింది. మార్కెట్ యార్డులోని గోదాంను సివిల్ సప్లయిస్ వారు అద్దెకు తీసుకొని 2018 సంవత్సరం నుంచి ఐదు లక్షలకు పైగా గోనె సంచులను నిలువ చేశారు. ఆదివారం ఉదయం గోదాంలో నుంచి పొగ రావడాన్ని స్థానికులు గమనించి


గోదాంలో దగ్ధమవుతున్న గోనె సంచులు

గోదాం ఇన్‌చార్జి బూరం సురేష్‌తోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మంటలు భారీగా వ్యాపించడంతో జగిత్యాల, నిర్మల్, భీంగల్, కమ్మర్‌పల్లి కేంద్రాల నుంచి అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పడానికి యత్నించారు. అయినా గోదాంలో నుంచి దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎల్‌సీఎస్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్‌లు ఆధ్వర్యంలో మూడు ఎక్స్‌కవేటర్లతో గోదాం గోడలను బద్దలుకొట్టి దగ్గమవుతున్న గోనె సంచులను బయటకు తీసి ఆర్పి వేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తొమ్మిది గంటలపాటు శ్రమించారు. సంఘటన స్థలాన్ని ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రాములు, తహసీల్దార్ నీత, సివిల్‌సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్ పరిశీలించారు. సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని సివిల్ సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్ తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు స్పష్టంగా తెలియకపోవడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రతి సంవత్సరం కోట్లల్లో ఆదాయం వచ్చే మార్కెట్ యార్డుకు కనీసం వాచ్‌మెన్ కూడా లేకపోవడంపై ఏఎంసీ అధికారుల నిర్లక్షం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు.


మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంలో మంటలను ఆర్పేందుకు ఎక్స్‌కవేటర్‌తో గోడను కూల్చుతున్న సిబ్బంది

పాన్‌షాప్ నిర్వాహకుడిపై జులాయిల దాడి

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోల్‌సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): షాపు ముందు సిగరెట్ తాగవద్దన్నందుకు నలుగురు జులాయిలు పాన్‌షాప్ నిర్వాహకుడిపై దాడి చేసిన ఘటన ఆదివారం గోదావరిఖని మార్కండేయకాలనీ జంక్షన్‌లో జరిగింది. శ్యామ్ అనే పాన్‌షాపు నిర్వాహకుడి వద్దకు వచ్చిన నలుగురు యువకులు సిగరెట్ తీసుకుని షాపువద్ద తాగుతుండగా అతడు అడ్డు చెప్పాడు. దీంతో కౌంటర్‌లోని డబ్బులు లాక్కున్న యువకులు అతనిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన ఇతర షాపుల వారిపై కూడా దౌర్జన్యానికి పాల్పడుతూ పిడిగుద్దులు గుద్దారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద గొడవ జరుగుతున్నా స్థానికులు స్పందించలేదు. పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ఇంద్రసేనారెడ్డి, పోలీసులు వెంటనే స్థలానికి చేరుకుని గొడవకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారు మద్యం మత్తులో ఉన్నట్టు స్థానికులు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎల్‌ఎండీ పోలీసులు పట్టుకున్నారు. మానకొండూర్ మండలం లింగాపూర్‌లోని వాగునుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అలుగునూర్ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. అదేవిధంగా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో గల మోయతుమ్మెద వాగు నుంచి సైతం అనుమతి లేకుండా ఇసు కను తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను కొత్తపల్లి శివారులో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యాజమానులు తాళ్ల సంతోష్, గుంటక రాజు, డ్రైవర్లు తాళ్ల ప్రశాంత్, న్యాలం చందుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి శివారులో చిరుత పులి సంచారం

● అప్రమత్తంగా ఉండాలంటున్న అటవీ అధికారులు

ధర్మపురి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ శివారులో గల పోచంపుంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి సంచారం కలకలం సృష్టించింది. రెండు రోజుల క్రితం వ్యవసాయ పనులకు వెళ్లిన ఒక వ్యక్తికి చిరుత పులి పిల్ల కనిపించడంతో భయంతో పరుగులు తీశాడు. పట్టణ శివారులో గల పోచంపంపు, ఇతరత్రా వ్యవసాయ భూములకు పెట్రోల్ బంక్ పక్క నుంచి ఎడ్ల బండ్ల దారి, కమలాపూర్ దారి గుండా నిత్యం అనేక మంది రైతులు, వ్యవసాయ కూలీలు పనులకు వెళ్తుంటారు. వ్యవసాయ పనులకు వెళ్లిన వ్యక్తికి చిరుత పులి కనిపించడంతో స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఆదివారం పరిసర ప్రాంతాల్లో కాళ్ల పాద ముద్రల కొలతలు తీసి చిరుత పులి అడుగులుగా భావిస్తున్నట్లు తెలిపారు. పోచంపంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి సంచరించినట్లు కొందరు వ్యక్తులు అటవీ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు నేరెళ్ల అటవీ బీట్ అధికారి జీవన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం వెళ్లి చిరుత పులి సంచరించిన ప్రదేశాల్లో కాళ్ల వేలి ముద్రల కొలతలు తీసుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు గుంపులు గుంపులుగా వెళ్లాలని ఆయన అన్నారు. సాయంత్రం 4 గంటల లోపుగా పనులు ముగించుకుని రైతులు, వ్యవసాయ కూలీలు తిరిగి ఇంటికి రావాలని ఆయన సూచించారు.


ధర్మపురి శివారులో గల పోచం పుంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి పాద ముద్రల కొలతలు తీస్తున్న అటవీ శాఖ అధికారులు

ప్రకృతి రమణీయంగా.. కొండలరాయుడి కోట..




కొండలరాయుడి కోట



రాతి కట్టడాలలో కొలను

● కొండగట్టులో భక్తులను ఆకట్టుకుంటున్న రాతి కొండ

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి వెనకాల వాయువ్యం వైపున ఎత్తయిన గుట్టలు, పచ్చని చెట్లు, చుట్టూ ప్రకృతి రమణీయత మధ్య గల కొండలరాయుడి రాతి కోట చారిత్రాత్మకమైంది. వందల ఏళ్ల చరిత్ర గల ఈ రాతి కోటను మల్యాల మండలం మానాలకు చెందిన బల్మూరి కొండలరాయుడు నిర్మించాడని చరిత్రకారులు చెబుతారు. వివాహమైన చాలా కాలం తర్వాత దంపతులకు అంజన్న పుణ్యఫలంగా బల్మూరి కొండలరాయుడు జన్మించాడని స్థానికులు పేర్కొంటారు. బల్మూరి కొండలరాయుడు ఆలయం వెనకాల రాతి కోటతో పాటు నీటి కొలను నిర్మించినట్లు స్థానికులు చెబుతారు. రాతి కొండను సందర్శించే భక్తులకు బండ రాళ్లపై గుర్రపు స్వారీ చేసిన గుర్రపు అడుగుల డెక్కలు, బురుజు, కోటగోడలు, కొలను చూడవచ్చు. అంజన్న దర్శనానికి వచ్చే భక్తులు కొండలరాయుడి కొండకు వెళ్లి అక్కడి నుంచి ప్రకృతి సుందర దృశ్యాలను తిలకిస్తుంటారు. ఎత్తైన ప్రాంతంలో గల కొండలరాయుడి కోటను సందర్శించే భక్తులు అక్కడి నుంచి పచ్చని గుట్టలు, చెట్ల మధ్య గల కరీంనగర్-జగిత్యాల రహదారి, రైల్వే మార్గం, వరదకాలువ దృశ్యాలను చూస్తూ ఫొటోలు దిగుతుంటారు. కొండలరాయుడి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే చాలా మంది ప్రకృతి ప్రేమికులు వచ్చే అవకాశం ఉంది.



బండపై గుర్రపు డెక్కల గుర్తులు

ఖోఖో క్రీడాకారులు.. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

● ఉమ్మడి జిల్లాలో ఖోఖో క్రీడాభివృద్ధికి కృషి

● జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరందర్‌రెడ్డి

● ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు



ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని, అందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఆదివారం జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ ఖో-ఖో పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోఉన్న క్రీడాకారుల ప్రతిభకు కొదవలేదని, కావాల్సింది ప్రోత్సాహమేనని అన్నారు. నిత్య శిక్షణ, క్రమశిక్షణతో రాణిస్తే భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగే అవకాశముందన్నారు. జిల్లా ఖో-ఖో క్రీడారంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఖో-ఖో అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందజేస్తానన్నారు. జిల్లాలో రాష్ట్ర, జాతీయ స్థాయి ఖో-ఖో క్రీడలను నిర్వహించేందుకు కృషిచేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలన్నారు. వివిధ సంస్థల్లో ఉద్యోగులుగా చేరేందుకు క్రీడాకారులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు.

జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి తెలంగాణ ఖో-ఖోఅసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడిజిల్లా నుంచి 130మంది క్రీడాకారులు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్, 30మంది సీనియర్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. అంతకుముందు సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరందర్ రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భారత మహిళల ఖో-ఖో జట్టు కోచ్ నరేష్, కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పోలీసు సీఐ కుమారస్వామి, వివిధ జిల్లాల ఖో-ఖో సంఘాల ప్రధానకార్యదర్శులు డాక్టర్ వేల్పుల కుమారస్వామి, లక్ష్మయ్య, డాక్టర్ రవీందర్, ఎస్‌కే మోయినుద్దీన్, సూర్యప్రకాశ్, జిల్లా పెటాఅధ్యక్ష, కార్యద ర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, పెద్దపల్లి పెటా అధ్యక్షుడు డాక్టర్ వేల్పుల సురేందర్, అంతర్జాతీయ ఖో-ఖో క్రీడాకారులు గెల్లు మధుకర్, వెంకటేశ్, రాజు, డాక్టర్ నవీన్, జిల్లా ఖో-ఖో సంఘంప్రతినిధులు కట్ట సంతోష్, శేఖర్, శివకుమార్, రాజబాబు, మధుసూదన్, శ్రీలత, జ్యోతి, సంధ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద

● ప్రాజెక్టులోకి 28,147 క్యూసెక్కుల నీరు రాక



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రావడం ఆదివారం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు బాబ్లీ గేట్లు ఎత్తివేయడం, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ తదితర ప్రాజెక్టులు నిండడంతో ఎస్సారెస్పీలోకి 28,147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 41.907 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగునీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 8,773 క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు. కాకతీయ కాలువకు 3,500క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150క్యూసెక్కులు, వరద కాలువకు 3వేల క్యూసెక్కులు, అల్లీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360క్యూసెక్కుల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 462 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 34.658 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 5.748 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం

● స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం ● కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసం ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు రాజన్నకు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోడెమొక్కు చెల్లించేందుకు భక్తులు సుమారుగా మూడు గంటలపాటుగా బారులు తీరారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతి రాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకుని తరించారు. రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గండ దీపంలో నూనెపోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి చర్యలు తీసుకున్నారు.



భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ఆకట్టుకున్న అనువంశిక అర్చక కుటుంబాల భజన..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో గోపన్నగారి మాధవి ఆధ్వర్యంలో అనువంశిక అర్చక కుటుంబాల మహిళలు చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

శ్రావణ మాసం సందర్భంగా అర్చక కుటుంబాల మహిళలు నాంపల్లి లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి తరలివెళ్లారు. స్వామివారిని దర్శించుకుని భజన చేశారు.

మనువాదంతో నరమేధం సృష్టిస్తున్నారు

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ఓదెల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మత్మోనాదం, మనువాదం, నియంతృత్వంతో అడవుల్లో నరమేధం సృష్టిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలో ఆదివారం స్వర్గీయ ఇట్యాల వెంకటయ్య ప్రాంగణంలో ఆరుట్ల రామచంద్రారెడ్డి భవన్ వద్ద ఆదివారం సీనాయర్ నాయకుడు ఆది రామారావు అధ్యక్షతన సీపీఐ మండల పదవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ చెప్పినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యం, కూడు, గుడ్డ నీడ ప్రజలకు అందించడం లేదని తెలిపారు. నీరవ్ మోడీ, విజయ్‌మాల్యా లాంటి ఆర్థిక నేరస్తులు వేలాదికోట్లు ఎత్తుకెళ్లి విదేశాల్లో ఉంటున్నారని అన్నారు. అలాంటివారిని దేశానికి రప్పించకుండా కర్రిగుట్టలు, దండకారణ్యంలో క్రూరమైన చర్యలకు పాల్పడుతూ ఆదివాసీలు, మావోయిస్టులను చంపివేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులు శాంతిచర్చలకు ముందుకు వచ్చినా కూడా ప్రధాని, అమిత్‌షా మొండిగా వ్యవహరించి అడవుల్లో వందలాది మందిని ఎదురు కాల్పుల పేరుతో కాల్చివేశారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను ఉల్లంఘించి చంపేహక్కు వీరికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. బీసీలకు ఉపయోగపడే రిజర్వేషన్ బిల్లును ప్రధాని, గవర్నర్ అడ్డుకోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ఇందిరమ్మ కమిటీల పేరుతో పేదలకు అన్యాయం జరిగిందని, రాష్ట్రంలో బ్రాందీషాపుల ద్వారా రూ.25వేలకోట్ల నుంచి రూ.30వేలకోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని, ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీలో ఉండాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేని శంకర్, జిల్లాకార్యదర్శి తాండ్ర సదా నందం, డిహెచ్‌పీఎస్ రాష్ట్రనాయకుడు తాళ్లపల్లి లక్ష్మణ్ సమావేశంలో మాట్లాడారు. అనంతరం మండలంలో మూడేళ్లపాటు కార్యక్రమాల నివేదికను కోడం స్వామి చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, కరీంనగర్ టౌన్ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి కోడం స్వామి, ఆళ్ల చిన్న శ్రీనివాస్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

అలుగుపారుతున్న సింగరాయకుంట

● నిండుకుండులా పత్తికుంట చెరువు



మత్తడి దూకుతున్న సింగరాయకుంట

ఇల్లంతకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సింగరాయకుంట, పత్తికుంట చెరువులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. రహీంఖాన్‌పేట గ్రామసమీపంలోని సింగరాయకుంట నిండటం వల్ల రహీంఖాన్‌పేట, నారెడ్డిపల్లె, పండలాపురం, కందికట్కూర్ గ్రామాల సమీపం నుంచి మధ్యమానేరులోకి నీరు వెళ్తోంది. దీనితో ఈ ప్రాంతాల రైతుల బావుల్లో భూగర్భజలాలు పెరగనున్నాయి. పత్తికుంటపల్లె గ్రామసమీపంలోని పత్తికుంట చెరువులోకి భారీగా నీరుచేరడంతో మత్తడి దూకుతోంది. చెరువులు నిండటం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎగువ మానేరుకు పెరుగుతున్న వరద

● 25 ఫీట్లకు చేరిన నీటి మట్టం

గంభీరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు పొంగిపొర్లుతోంది. దీంతో వరదనీరు మానేరు జలాశయంలోకి భారీగా వస్తోంది. మొత్తం 31 ఫీట్ల సామర్థ్యం గల మానేరు నీటి మట్టం ప్రస్తుతం 25 ఫీట్లకు చేరింది. మానేరు మత్తడి దూకేందుకు మరో 6 ఫీట్ల నీరు అవసరం ఉండటంతో ఈ ప్రాంత రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.



నిండు కుండలా ఎగువ మానేరు జలాశయం

అపరిశుభ్రంగా గోదావరి తీరం

● శివుడి విగ్రహం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరినది వద్ద ఏర్పాటు చేసిన శివుని విగ్రహం చుట్టూ చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా మారినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రావణమాసం సందర్భంగా గోదావరి నదికి వందలాది మంది భక్తులు పుణ్యసాన్నాలు ఆచరించడానికి వస్తున్నారు. గోదావరి వద్ద శివుని విగ్రహాన్ని పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శివుడి విగ్రహం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించి విగ్రహానికి రంగులు వేయిం చారు. కానీ విగ్రహం చుట్టూ పాలిథిన్ కవర్లు, దేవుని ఫొటోలతో పేరుకుపోయినా కార్పొరేషన్ అధికారులు తొలగించడం లేదు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానం చేసేందుకు ఏర్పాటు చేసిన మెట్లు కూడా చెత్తపేరుకు పోయింది. కార్పొరేషన్ అధికారులు వంద రోజుల కార్యాచరణ కార్యక్రమాలు అంటూ తూతూమంత్రంగా పనులు నిర్వహించి వెళ్లిపోతున్నారు. అపరిశు భ్రంగా మారిన గోదావరినది స్నానఘట్టాలను, శివుని విగ్రహం చుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.



శివుడి విగ్రహం చుట్టూ ఉన్న చెత్తాచెదారం, చిత్రపటాలు



గోదావరి ఒడ్డున ఉన్న చెత్తాచెదారం, చిత్రపటాలు

మల్లారపు శంకర్‌కు జాతీయ అవార్డు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామానికి చెందిన హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లారపు శంకర్‌ను బహుజనసాహిత్యఅకాడమీ వారు మహత్మ జ్యోతిబా పూలే జాతీయ అవార్డు 2025క ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మల్లారపు శంకర్‌కు సాహిత్య అకాడమీ జాతీయఅధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అభినందించారు. జాతీయ అవార్డు రావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 5న తిరుపతిలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 18వ జాతీయ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.



మల్లారపు శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి కాసుల పంట

● మహిళలకు ఉచిత ప్రయాణంతో సంస్థకు ఆదరణ ● రీజియన్ వ్యాప్తంగా రూ.721.35 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కాసుల పంటపండింది. పథకంతో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించడం, మహిళలు పెద్దమొత్తంలో ఆర్టీసీబస్సుల్లో ప్రయాణిస్తుండడంతో సంస్థకు కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023 సంవత్సరం డిసెంబరు 9వ తేదీన మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆనాటి నుంచి నేటి వరకు మహాలక్ష్మి పథకం కింద మహిళలు పెద్దసంఖ్యలో ఆర్టీసీ ఆదరిస్తున్నారు. దీంతో సంస్థకు పెద్ద ఎత్తున లాభాలు సమకూరుతున్నాయి.

కరీంనగర్ రీజియన్‌వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, మంథని, హుజూరాబాద్, హుస్నాబాద్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, గోదావరిఖనితో కలుపుకొని 11డిపోలు ఉన్నాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌జిల్లాలో ఆర్టీసీ 244బస్సులను నడిపించి 4.83కోట్లమంది ప్రయాణికుల ద్వారా రూ. 201.82 కోట్ల రూపాయలను ఆర్జించింది. జగిత్యాలజిల్లాలో 194 బస్సులను నడిపించి 5.38 కోట్ల మంది ప్రయాణికులతో 208.62కోట్లరూపాయలు, పెద్దపల్లిజిల్లాలో 136బస్సులతో 3.59కోట్లమంది ప్రయాణికులతో 154.08కోట్ల రూపాయలు, సిరిసిల్లజిల్లాలో 111బస్సులతో 2.87కోట్లమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి 113.73కోట్ల రూపాయలు, సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ డిపోలో 60 బస్సులను నడిపించి 1.26 కోట్ల మంది మహాలక్ష్మి ప్రయాణికులతో 43.11కోట్లరూపాయల ఆదాయాన్ని సంపాదించింది. మొత్తానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో 745 బస్సులను నడిపించి 17.93 కోట్ల మహాలక్ష్మి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి 721.35 కోట్ల రూపాయల ఆదాయాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్జించింది.

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా వివిధ డిపోల్లో వచ్చిన ఆదాయం

డిపో	బస్సులు	ప్రయాణికులు	ఆదాయం
హుజూరాబాద్	64	1.37	56.07
కరీంనగర్-1	87	1.71	60.89
కరీంనగర్-2	93	1.75	84.86
జగిత్యాల	95	2.40	93.07
కోరుట్ల	51	1.52	56.66
మెట్‌పల్లి	48	1.46	58.88
గోదావరిఖని	90	2.70	105.90
మంథని	46	0.89	48.18
సిరిసిల్ల	59	1.33	56.46
వేములవాడ	52	1.54	57.27
హుస్నాబాద్	60	1.26	43.11
రీజియన్ వ్యాప్తంగా	745	17.93	721.35

అనాథ ఆశ్రమంలో వృద్ధురాలి మృతి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీ శివ గాయత్రి అనాథ ఆశ్రమంలో గడ్డి మల్లుబాయి అనే వృద్ధురాలు ఆదివారం మృతి చెందినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. 2023 వ సంవత్సరం మార్చి 13 వ తేదీన మల్లుబాయి అనాథ ఆశ్రమంలో చేర్పించబడింది. నెల రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడుతుండగా అమెకు ఆశ్రమ నిర్వాహకులు చికిత్స అందిసు న్నారు. అయితే వృద్ధురాలి ఆరోగ్యం క్షీణించి ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. కాగా అనాథ వృద్ధురాలైన మల్లుబాయి అంత్యక్రియలను సంప్రదాయ బద్ధంగా ఆశ్రమ నిర్వాహకులు నిర్వహించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

బీర్‌పూర్,ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):గత రెండునర సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఇంటర్ విద్యార్థిని ఆదివారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందింది. బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన శైండ్ల మనూష(21)అనే విద్యార్థిని రెండున్నర సంవత్సరాలుగా రెండు కిడ్నీలు చెడిపోయి చికిత్స పొందుతోంది. కిడ్నీ సంబంధిత వ్యాధి ఉన్నప్పటికీ బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో చేరి 456 మార్కులతో ఉత్తీర్ణురాలు అయింది. డయాలసిస్ చేస్తున్న మనూష పరిస్థితి విషమంగా ఉండడంతో 15 రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మనూష మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

దుబాయ్‌లో రక్షాబంధన్ వేడుకలు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రక్షా బంధన్ వేడుకలను దుబాయ్‌లో జగిత్యాల జిల్లా వాసులు ఘనంగా నిర్వహించారు. దుబాయ్‌లోని ఎల్లాల శ్రీనన్న సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రవి డేవిడ్, ఉపాధ్యక్షులు బాలు బొమ్మటి, ఎలిగేటి గంగాధర్, శ్రీనివాస్, కంచు కొంరయ్య, నరేష్ కొండబత్తిని, అశోక్ జనగం, భూమేశ్వర్, వేణుగోపాల్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం వుడ్ కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎదులాపురం కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని మనుమయ సంఘం భవనంలో నిర్వహిం చిన ఎన్నికలలో కుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన కుమార్‌ను సంఘ సభ్యులు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మనుమయ సంఘం అధ్యక్షులు కొండ మురళి, నాయకులు శంబోజి శ్రీనివాస్, గజేంద్ర భీష్మ రవి, మ్యాడపు అశోక్ పాల్గొన్నారు

'నులి'పేద్దాం

- నేటి నుంచి నులి పురుగు నిర్మూలన కార్యక్రమం
- ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పంపిణీ
- జిల్లాలో 2.22 లక్షల మంది గుర్తింపు



జగిత్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల సమస్య పిల్లలను కుంగదీస్తోంది. శారీరక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రక్తహీనతకు గురి చేస్తోంది. సోమవారం జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఒకటి నుంచి 19సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

● 22 పీహెచ్‌సీల పరిధిలో..

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఒకటినుంచి 19 సంవత్సరాల చిన్నారులు 2,22,950మంది ఉన్నారు. జిల్లాలోని 22పీహెచ్‌సీల పరిధిలో కార్యక్రమం నిర్వహించనున్నారు. 793ప్రభుత్వ పాఠశాలలు, 242 ప్రయివేటు పాఠశాలలు, 75ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలు, 1,065 అంగన్‌వాడీకేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి 5సంవత్సరాల్లోపు వయస్సు గల 64,207మంది చిన్నారులు, పాఠశాలల్లో 6 నుంచి 16 సంవత్సరాల్లోపు వయస్సుగల పిల్లలు 1,29,376 మంది, జూనియర్ కళాశాలల్లో 16నుంచి 19సంవత్సరాల్లోపు వయస్సు గల పిల్లలు 26,912 మంది, ఒకేషనల్ కళాశాలల్లో 1,847 మంది పిల్లలు, పాఠశాలలబయట 1,508మంది పిల్లలున్నట్లుగా అధికారులు గుర్తించారు.

ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీల భాగస్వామ్యం

జిల్లాలో 742మంది ఆశా కార్యకర్తలు, 1,066 మంది అంగన్ వాడీటీచర్లు, 1,035మంది పాఠశాలల ఉద్యోగులు, 75మంది కళాశాలల ఉద్యోగులు భాగ స్వామ్యం కానున్నారు. గతంలో ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టు మాసాల్లో పిల్లలకు మాత్రలు పంపి ణీ చేసేవారు. 2020సంవత్సరంలో కరోనా మహమ్మారి తర్వాత ఆగస్టులో మాత్రమే ఈ కార్యక్రమం చేపడుతున్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో గుర్తించిన పిల్లందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలతో పాటు మిగిలినవారికి ఈనెల18వ తేదీన వేయనున్నట్లు సంబంధిత అధికారులు అంటున్నారు. కాగా ఒకటి నుంచి 2 సంవత్సరాల్లోపు చిన్నారులకు సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర, 3 నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలు మాత్రమే నమిలి మింగాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

పిల్లల్లో అనారోగ్యం..

పిల్లలు చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేయడం, మట్టిలో ఆడుకోవడం లాంటి కారణాలతో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లల కడుపులో నులి పురుగులు తయారవుతాయి. అవికడుపులో రక్తాన్ని పీల్చడంతో పాటు పిల్లల ఎదుగుదలపై ప్రభావంచూపుతాయి. తరచూ అనారోగ్యం బారిన పడడం, బరువుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు ఉండకపోవడంతో పాటు చురుకుదనం కోల్పోతున్నారు.

తప్పనిసరిగా వేయించాలి..

-డాక్టర్ ప్రమోద్ కుమార్, డీఎంహెచ్‌వో



జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పుర స్కరించుకొని జిల్లాలో చిన్నారులకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలి. అర్హులైన చిన్నారులందరికీ మాత్రలు వేయిస్తాము. యువజన, మహిళా సంఘాలు, మాజీ ప్రజాప్రతి నిధులు, అధికారులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలు సహకరించాలి.

'ఉపాధి' కుదింపు

(5వపేజీ తరువాయి)

చేస్తూ గ్రామీణ ప్రజలకు పని దినాలు కల్పించేవారు. దీంతో రైతులకు కూడా ప్రయోజనకరంగా ఉండేది. ప్రస్తుతం పనుల సంఖ్యను కుదించినట్లు తెలుస్తోంది.

● తగ్గిపోతున్న మెటీరియల్ కాంపొనెంట్

పని దినాలకు వెచ్చించిన కూలి డబ్బుల ఏడాది ఖర్చులో 40శాతం నిధులను మెటీరియల్ కాంపోనెంట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం నిర్మాణ పనుల కోసం విడుదల చేయాలని నిబంధన ఉంది. కానీ ఏటేటా పనిదినాలు తగ్గిపోవటంతో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు సైతం తగ్గుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఈ నిధులతో సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు నిర్మాణం చేసేవారు. ప్రస్తుతం ఈ శాశ్వత నిర్మాణ పనులు తగ్గినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే...

-రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



జిల్లాలో గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పని దినాలు కేటాయిస్తున్నాం. పని దినాలు పెంచాలని వస్తున్న అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి అవసరమైన చర్యలు చేపడుతాం. పని దినాలను అవసరం మేరకు పెంచుతాం.

గ్రామ దేవతలకు జలాభిషేకం



ఊరేగింపుగా వెళ్తున్న రైతులు

మల్లాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలం నడికుడా గ్రామానికి చెందిన రైతులు ఆదివారం గ్రామదేవతలకు విగ్రహాలకు జలాభిషేకం చేస్తారు. గ్రామానికి చెందిన ప్రతి రైతు సమీపన గల మొగిలిపేట గోదావరి నదికి వెళ్లారు. భక్తి శ్రద్ధలతో గంగానదిలో స్నానం చేసిన రైతులు నీటి బిందెలను నెత్తిన పెట్టుకుని డప్పు వాయిద్యాల నడుమ ఊర్లోకి చేరుకున్నారు. అనంతరం దేవతా విగ్రహాలకు జలాభిషేకం జరిపారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్



ధర్మపురి స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులుగా సింహరాజు ప్రసాద్ ఎన్నికయ్యారు. స్థానిక భవనంలో ఆదివారం స్వర్ణకార సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్ష పదవి కోసం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం సింహరాజు ప్రసాద్, చెన్నోజి ప్రభాకర్ పోటీలో నిలిచారు. ప్రసాద్ తన సమీప ప్రత్యర్థి ప్రభాకర్‌పై అధ్యక్షులుగా గెలుపొందారు. నూతన అధ్యక్షులుగా గెలుపొందిన సింహరాజు ప్రసాద్ మాట్లాడుతూ తన పట్ల ప్రేమ, నమ్మకంతో గెలిపించిన సంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వర్ణకార సంఘ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు మారుతి, స్వర్ణకార సంఘం సభ్యులు అభినందించారు.

వైభవంగా మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

కోరుట్ల, ఆగస్టు 10 : కోరుట్ల పట్టణంలోని సాయిబాబ దేవాలయ ప్రాంగణంలో మానసాదేవి సహిత గణపతి సుబ్రహ్మణ్యస్వామి నవ నాగ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు రమేష్, కిరణ్, వినయ్ మత్రోత్చరణ మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్విహించారు. ప్రత్యేక పూజలలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులతో పాటు దేవాలయ అభివృద్ధి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు అర్థరహితం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికలలో బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందని దానికి భారత ఎన్నికల సంఘం సహకరించిందని బీహార్‌లో జరుగనున్న ఎన్నికలలో ఓట్ల చోరీకి పాల్పడి గెలవాలని చూస్తుందని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహిత మని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం పేర్కొన్నారు. ఆదివారం ఆ పార్టీ నాయకులతో కలసి సత్యం పెగడపల్లిలో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట బోగస్ ఓటర్లను ఏరివేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి ప్రయత్నిస్తే ఓట్ల చోరీ జరిగింది అంటూ పార్లమెంట్ సాక్షిగా ఎలాంటి ఆదారాలు లేకుండా విమర్శించడం సిగ్గుచేటని విమర్శించారు. అసలైన ఓట్ల చోరీ నెహ్రూ హయాంలోనే జరిగిందని రాజ్యాంగ పరిషత్‌లోని పదిహేను మందికి పన్నెండు మంది సర్దార్ పటేల్‌కు తెలియజేయగా ముగ్గురు గైర్హాజరు అయితే జీరో ఓట్లు వచ్చిన నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్తూరు బాబు, జనార్దన్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు సుడా వాణిజ్య సముదాయానికి శంకుస్థాపన

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్ టౌన్ సమీ పంలో సుడా వాణిజ్య సముదాయ భవనా నికి శంకుస్థాపన చేయనున్నట్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్ర మానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరవుతారన్నారు. రెండు దశల్లో నాలుగు కోట్ల రూపాయలతో సుడా వాణిజ్య సముదాయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

సుల్తానాబాద్, ఆగస్టు 10: (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు నాయకులు సన్నద్ధం కావాలని, ఎన్నికలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని భారతీ య జనతా పార్టీ జిల్లా నాయకులు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ని పలువురు ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమావేశమైన ప్రవీణ్ వారికి ఎన్నికల గురించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆమలు చేస్తున్న ఆనేక సంక్షేమ పథకాల గురించి, వాటి ప్రయో జనాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. కలిసికట్టుగా అభ్యర్థులను గెలిపించాలన్నారు.

ప్రమాదాలు జరిగినా తీరు మారదా..?



బారికేడ్‌లో ఇరుక్కుపోయిన వాహనం

మల్యాల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై గతంలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో దిగువ కొండగట్టు ఘాట్‌రోడ్డు మొదట్లో, కొండపై నైజంక్షన్ వద్ద భారీ వాహనాల రాకపోకల నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే ఈ ఘాట్‌రోడ్డుపై పర్యవేక్షణ లేక తరచూ భారీ వాహనాలు ఈ బారికేడ్ల కింద నుంచి వస్తూ ఇరుక్కుపోతున్నాయి. బారికేడ్ల ఉనికి ప్రశ్నార్థకం అవుతుంది. అయినా పట్టించుకునే వారే లేకపోవడంతో వాహనాలు ఇలా ఇరుక్కుపోతున్నాయి.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

-హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్

కోరుట్ల, ఆగస్టు 10 : ప్రజలందరు రాజ్యంగంపై అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. ఆధివారం పట్టణంలోని సీనారే కళాభవనంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యంగం నేటి పరిస్థితులపై జరిగిన అవగాహన సదస్సులో న్యాయమూర్తి చంద్రకుమార్ పాల్గొని రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మానస వికాస రాష్ట్ర నాయకుడు హన్మంత్‌రావు, సిపిఐ నాయకులు చెన్నవిశ్వనాథం, ఏఐటీయేసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, నాయకులు తిరుపతి నాయకులు, శంకర్, ఎండి ముక్రం, మౌలన, భూమేశ్వర్ నాయకులతో పాటు వామపక్ష నేతలు పాల్గొన్నారు.

విశ్రాంత న్యాయమూర్తికి ఘన సన్మానం

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి పి. చంద్రకుమార్ సేవలు వెలకట్ట లేనివని న్యాయవాది, కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు కొండ మురళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సౌదీ జైలులో వెంగళాయిపేట వాసి

పెగడపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలం వెంగళాయిపేట గ్రామానికి చెందిన పబ్బతి ప్రశాంత్ (41) అనే వ్యక్తి ఎనిమిది నెలలుగా సౌదీ అరేబియాలోని రియాద్ జైలులో మగ్గుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముంబాయిలోని ఒక రిక్రూటింగ్ ఏజన్సీ ద్వారా ప్రశాంత్ జూన్ 2022లో కూలీగా పని చేయడానికి రియాద్ చేరుకున్నాడు. సరైన పని, జీతం లేకపోవడంతో నెల రోజులకే కంపెనీ నుంచి బయటకు వెళ్లిపోయి వేరే చోట పనికి కుదిరాడు. ప్రశాంత్ నాటు సారా మద్యం కేసులో అరెస్టు అయినట్లు అనధికార సమాచారం. సౌదీ చట్టాల ప్రకారం మద్యం తయారీ విక్రయం వినియోగం పూర్తిగా నిషేధం. పట్టుబడిన నిందితులకు జరిమానా, జైలు శిక్షతో పాటు దేశ బహిష్కరణ విధిస్తారు. గత ఎనిమిది నెలలుగా తన తండ్రి జైల్లో మగ్గుతున్నాడని, ఆర్థికంగా పేదలమైన తాము కుటుంబం గడవడం కూడా కష్టంగా మారిందని తమ తండ్రిని సౌదీ జైలు నుంచి విడిపించాలని కుమారుడు సంజయ్ ప్రభుత్వాన్ని కోరాడు.

వరద కాలువ గేట్ల ప్రతిపాదనపై ఆశలు

● ప్రభుత్వం నిధులు కేటాయించాలని అన్నదాతల వినతి



కథలాపూర్‌లో వరద కాలువ

కథలాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనేక గ్రామాలకు వరప్రదాయినిగా ఉన్న వరద కాలువకు కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి ఎత్తిపోతలు నిలిచిపోవడంతో గేట్ల ఏర్పాటు మళ్లీ తెరపైకి వచ్చింది. వర్షాలు లేక ప్రాజెక్టులు నిండకపోవడంతో రివర్స్ పంపింగ్ లేని కారణంగా వరద కాలువ పూర్తిగా ఎండిపోయింది. ఈ నేపథ్యంలో వరద కాలువపై ఆధార పడి పంటలు వేసుకున్న రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం మన్నెగూడెం, దమ్మన్నపేట శివారులో గేట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఇంజనీర్లు ఈ మేరకు సర్వే చేసి నివేదికలు అందించారు. అప్పుడు గేట్ల ఏర్పాటుకు మోక్షం లభించలేదు.

● కాంగ్రెస్ సర్కారుపై ఆశలు

గేట్ల ఏర్పాటు వల్ల పైభాగంలో ఉన్న కథలాపూర్, బీమారం, మేడిపల్లి మండలాల రైతులకు మేలు చేకూరనుంది. గేట్లు మూసి వేస్తే నీళ్ళు పుష్కలంగా కాలువలో నిల్వ ఉండడానికి అవకాశం ఏర్పడుతుందని రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఎమ్మెల్యేకు పలుమార్లు ఇక్కడి రైతులు గేట్ల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఎస్ఆర్ఎస్‌పీ అధికారులను ఆదేశించి సర్వేలు చేయించారు. 58వ కిలోమీటర్ రాయి వద్ద గేట్లు నిర్మించేలా చూడాలని ఈఎన్‌సీకి ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈఎన్‌సీ కార్యాలయంలో గేట్ల నిర్మాణంకు సంబంధించిన ఫైలు నిధుల మంజూరు నిమిత్తం వెళ్ళినట్లు తెలిసింది. ఈ క్రమంలో రైతులకు కొత్త ప్రభుత్వంపై ఆశలు పెరిగాయి. ప్రస్తుతం కింది భాగంలో రాంపూర్, పైభాగంలో రాజేశ్వర్‌రావు, ముప్కాల్ వద్ద గేట్లు ఉన్నాయి. రాంపూర్ వద్ద గేట్ల నుంచి కిందికి వదలుతుండడం వల్ల కథలాపూర్, బీమారం, మేడిపల్లి మండలాల పరిధిలో ఉన్న కాలువలో నీరు నిలవడం లేదని రైతాంగం వాపోతున్నారు.

● గేట్లు నిర్మిస్తేనే కాలువకు జలకళ

-శ్రీకాంత్, సింగిల్‌విండో డైరెక్టర్



మన్నెగూడెం, దమ్మన్నపేట శివారులో వరద కాలువపై గేట్లు నిర్మిస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రభుత్వం గేట్ల నిర్మాణంకు నిధులు మంజూరు చేస్తే మేలు చేకూరుతుంది. మూడు మండలాల్లో వేలాది ఎకరాల పంటలు ఎండిపోవడానికి అవకాశం ఉండదు. కాలువపై ఆధారపడి పంటలు ఏటా సాగు చేసుకుంటున్నాం. రివర్స్ పంపింగ్ చేసినా, ఎస్ఆర్ఎస్‌పీ నుంచి వదిలినా జలకళకు ఆస్కారం ఉంటుంది.

రహదారిపై విరిగి పడ్డ మర్రివృక్షం

మల్యాల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలోని అంగడిబజారులో రహదారిపై ఆదివారం సాయంత్రం మర్రి వృక్షం ఒక పక్క పెద్ద కొమ్మ కూలింది. నిత్యం జనాలు, వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో కొమ్మ కూలిన సమయంలో ఎలాంటి జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్ది దూరంలోనే వాహనాలు ఉన్నప్పటికీ పెద్దగా నష్టమేమి జరుగలేదని స్థానికులు తెలిపారు. చాలా కాలం నాటి వృక్షం కావడంతోనే కొమ్మలు విరిగిపడుతున్నట్లు పేర్కొన్నారు.

బలహీన వర్గాల దిక్సూచి శివశంకర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల దిక్సూచి దివంగత కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ అని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ అన్నారు. ఆదివారం ముకాస విద్యార్థి వసతి గృహం లో నిర్వహించిన శివశంకర్ 96వ జయంతి సంద ర్భంగా వాళులర్పించారు. అనంతరం హరి శంకర్ మాట్లాడుతూజాతీయ స్థాయిలో బీసీలకు విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయన్నారు.

ఘనంగా మంత్రి అడ్లూరి వివాహ వార్షికోత్సవం

ధర్మపురి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్-కాంతాకుమారి వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో మంత్రి పేరట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయన రాజకీయంగా మరింత ముందుకు సాగాలని కోరుతూ స్వామి వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ మాజీ చైర్మన్ సంగనభట్ల దినేష్, అర్చకులు అశ్విన్‌కుమార్, నేరెళ్ల సంతోష్‌కుమార్, బొజ్జ రాజగోపాల్, సముద్రాల వంశీకృష్ణ, ఆలయ ధర్మకర్తలు ఏదులాపురం మహేందర్, బాదినేని వెంకటేష్, బొల్లారపు పోచయ్య, రవీందర్, కొమురెల్లి పవన్‌కుమార్, మందుల మల్లేష్, నేదునూరి శ్రీదర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల మెయిన్ రోడ్డుకు మహర్దశ

-హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు



నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు

కొడిమ్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కావటంతో కొడిమ్యాల పట్టణానికి మహర్దశ వచ్చింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఆరు నెలలుగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మండల కేంద్రంలోని మేయిన్ రోడ్డుకు 1996-1997 సంవత్సరం అప్పటి సర్పంచు వడ్లకొండ నాగలక్ష్మీహన్మండ్లు, పాలక వర్గ సభ్యుల ఆదర్యంలో మండల కేంద్రంలోని అంగడి బజారు నుండి శివాజీ విగ్రహం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. సుమారు 10సంవత్సరాల నుంచి మండల కేంద్రంలోని సీసీ రోడ్డు అడుగడుగున గుంతల మయంగా మారి వర్షం పడిన తర్వాత ద్విచక్ర వాహనాలు నడుపాలంటే ప్రయాణం భయం భయంగా సాగుతుండేది. మండల కేంద్రంలోని మేన్ రోడ్డుకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని సుమారు పది సంవత్సరాల నుండి ప్రజలు పాలకులకు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసిన ఎవరు పట్టించుకోలేదు. గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణం చేయాలంటి ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత సంవత్సరం జరిగిన ఎంపీ ఎన్నికల కోడ్ రాక ముందు బీజేపీ నాయకులు అంగడి బజారు నుండి బస్టాండ్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేయటానికి భూమి పూజ చేశారు. కొడిమ్యాల మాజీ సర్పంచు ఏలేటి మమతనరసింహారెడ్డి ఆద్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.

అందరి సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణం

-మమత, మాజీ సర్పంచ్, కొడిమ్యాల



కొడిమ్యాల పట్టణ ప్రజల సహకారంతో బస్టాండ్ నుండి అంగడి బజారు వరకు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశాం. నిధుల మంజూరుకు కృషి చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు.